క్లుప్తంగా

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 15.24 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీలు లెక్కించారు. 39 రోజులకు గాను అమ్మవారి దర్శనాలకు సంబంధించిన హుండీల ఆదాయం రూ.15,24,168 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ బాబా తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదత్తసాయి మందిరం 24వ వార్షికోత్సవం


సాయిబాబాకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేటలో వెలసిన శ్రీ దత్తసాయి మందిరం 24వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు పంపాన గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో కళా ఆస్పత్రి అధినేత రమణమూర్తి పాల్గొని అన్నసమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలరావు, కోశాధికారి వాసుపల్లి నారాయణరావు, పంపాన గణేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

29న ఏపీ ప్రజా నాట్యమండలి ఉత్సవాలు

అల్లిపురం: అమర కళాకారుల శత జయంతి, మహాకవి శ్రీశ్రీ 113వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏపీ ప్రజా నాట్యమండలి సన్నద్ధమవుతున్నట్లు ప్రజా నాట్యమండలి నాయకుడు జి.కాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీన శ్రీశ్రీ శత జయంతి ఉత్సవాలు పౌర గ్రంథాలయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి అభ్యుదయ గేయాలాపన కార్యక్రమం ఉంటుందన్నారు. సభకు డాక్టర్ సి.స్టాలిన్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, జాతీయ ఉపాధ్యక్షుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి హాజరవుతారని తెలిపారు. మాతృశ్రీ కళానికేతన్ వారిచే ఇది కథ కాదు నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం శ్రీశ్రీ రూపకం ప్రదర్శన అనంతరం ముగింపు సభ ఉంటుందన్నారు. సభకు ముఖ్య అతిథిగా ఆర్‌పీ రామారావు హాజరవుతారని పేర్కొన్నారు.

రోగికి శ్రీవత్సవ్ పరామర్శ

మహారాణిపేట : జీవీఎంసీ 30వ వార్డుకు చెందిన ఆకుల శ్యామ్ భార్య ఆకుల రోజారాణి అనారోగ్యంతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. గురువారం ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ కేజీహెచ్‌కు వెళ్లి ఆమెను పరామర్శించారు. రోజారాణి ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు.

వికసించిన విద్యా కుసుమాలు..

ప్రభుత్వ బాలికల కళాశాల విద్యా కుసుమాలు వికసించాయి. వారు పేదరికాన్ని జయించారు. చదువుకు పేదరికం అడ్డురాదని నిరూపించారు. కార్పొరేట్ కళాశాలలో చదివే స్తోమత లేకపోయినా.. ప్రభుత్వ బాలికల కళాశాలలో చదివిన విద్యార్థినులు కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా రాణించారు. తల్లిదండ్రులిద్దరూ కూలి పనులు చేసుకుంటూ పిల్లల్ని చదివించారు. తల్లిదండ్రుల కలలకు జీవం పోసారు వారు.


విద్యా కుసుమాల చదువుల నెలవు.. ప్రభుత్వ బాలికల కళాశాల

- అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత
- తల్లిదండ్రుల ఆశయాలే ఆలంబనగా ముందడుగు
- ఇంటర్‌లో సత్తా చాటిన ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు


ఎంపీసీలో 936 మార్కులు సాధించిన రోహిణి


బైపీసీలో 932 మార్కులు సాధించిన హరిణి


సీఈసీలో 957 మార్కులు సాధించిన వనిత

దాబాగార్డెన్స్: బుధవారం సాయంత్రం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో దక్షిణ నియోజకవర్గంలో గల ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. చదువుకి పేదరికం అడ్డురాదని నిరూపించారు. ఆర్. వనిత సీఈసీ గ్రూప్‌లో 957, వై. రోహిణి ఎంపీసీ గ్రూప్‌లో 936, కె. భాను సీఈసీ గ్రూప్‌లో 932, యు. హరిణి బైపీసీ గ్రూప్‌లో 932 మార్కులు తెచ్చుకున్నారు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి ఎంఎల్‌టీలో ఎస్. జాన్సీ 967, సీఎస్‌ఈలో వి. స్వాతి 963, ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్)లో షేక్ షంషద్ బేగం 961, సీఎస్‌ఈ గ్రూప్‌లో షేక్ ఆసిఫా బేగం 961, ఎంఎల్‌టీలో ఆర్. వర్షిణికి 959 మార్కులు వచ్చాయి.

ఉత్తీర్ణత శాతం ఇలా..

కళాశాల నుంచి మొదటి సంవత్సరం వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి మొదటి 209 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా 163 మంది (77.99 శాతం), ద్వితీయ సంవత్సరం వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి 219 మంది విద్యార్థినులు హాజరుకాగా 176(80.33) మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం జనరల్ కోర్సులకు సంబంధించి 452 మంది పరీక్షలకు హాజరుకాగా 198(43.8 శాతం), సెకండియర్ జనరల్ కోర్సులకు సంబంధించి 503 మంది విద్యార్థినులకు గాను 198 (39.36 శాతం) మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. వీరంతా బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన వారు కావడం విశేషం.

రాష్ట్రవ్యాప్త నిరసనను విజయవంతం చేయాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న సీహెచ్ నరసింగరావు తదితరులు

సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మే 3న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు, హైవేల దిగ్బంధం చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న 755వ రోజు దీక్షల్లో ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని అనేక ఏళ్ల నుండి డిమాండ్ చేస్తున్నా ఆ పని చేయలేదన్నారు. మే 3న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పోరాటంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, నాయకులు బి. జగన్, జ్యోతేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, కె.కుమారి, ఆర్.విమల, బి.రమణి తదితరులు పాల్గొన్నారు.

అథారిటీ ఏర్పాటు పట్ల హర్షం


మంత్రి శ్యాంప్రసాద్

దాబాగార్డెన్స్: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలో జీవో 75 ద్వారా జిల్లా స్థాయి పోలీస్ కంప్లైంట్ అథారిటీలను నియమించినందుకు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీస్ ఫిర్యాదుల అథారిటీ అనేది వివిధ రాష్ట్రాల పోలీసు అధికారుల చర్యలు సమీక్షించడానికి ఏర్పాటు చేసిన ఓ కమిటీ అని పేర్కొన్నారు. పోలీసు అధికారుల అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా దుష్ప్రవర్తన, ప్రాథమిక హక్కులు, మానవ హక్కులు ఉల్లంఘించడం, నేరాలు చేయడానికి వారికివ్వబడిన అధికారాన్ని అన్యాయంగా ఉపయోగించుకోవడం వంటి వాటి రూపంలో సాధారణ ప్రజలకు ఫిర్యాదు చేసే హక్కు కల్పిస్తుందని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం, కేసుల నాసిరకం దర్యాప్తు, నిర్బంధించి హింసించడం వంటి నేరాలకు కూడా ఈ అధికారులు నేరారోపణ చేయబడతారని, అలాంటి కేసులను పోలీస్ ఫిర్యాదు అథారిటీ ద్వారా పరిష్కరించాలని శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. విశాఖ ప్రధాన కార్యాలయంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాలకు చైర్మన్‌గా రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి ఎ. వరప్రసాదరావు, సభ్యులుగా రిటైర్డ్ డీఎస్పీ కె. రంగరాజు, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పి. రజనీకాంతరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధి పి. జగన్మోహనరావును నియమించారని, నగర పౌరులు ఈ సేవలు వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు.

రెజ్లర్ల పోరాటానికి ప్రజా సంఘాల మద్దతు


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

సీతమ్మధార : రెజ్లర్లపై లైగింక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరన్‌సింగ్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత ఐదు రోజులుగా రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలియజేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ రెజ్లర్లపై లైగింక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీపై పోలీసులు ఇంత వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. అతనికి శిక్ష పడే వరకు తాము వెనక్కి తగ్గేదేలేదన్నారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన చైర్మన్ దండు నాగేశ్వరరావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యూఎస్ఎన్‌రాజు, కె.సంతోష్, ఎల్‌జే నాయుడు, ఎం.సుబ్బారావు, భారతి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీల వసూలు వేగవంతం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో కిశోర్

జగదాంబ: యూజర్ చార్జీల వసూళ్లు వేగవంతం కావాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో ఎస్.కిశోర్ అన్నారు. గురువారం ఆయన జోన్ పరిధిలో ఉన్న 12 వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. యూజర్ చార్జీలు బాధ్యతగా వసూలు చేయాలన్నారు. స్లమ్, నాన్‌స్లమ్‌తో పాటు కమర్షియల్ ప్రాంతాల్లో వసూలు చేయాలని తెలిపారు. వసూలు చేసిన సొమ్మును ఎప్పటికప్పుడు జీవీఎంసీకి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా బస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ


కార్గో సెక్షన్‌ను తనిఖీ చేస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్

దాబాగార్డెన్స్: ద్వారకా బస్‌స్టేషన్‌ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రవికుమార్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ బి. అప్పలనాయుడు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్గో సెక్షన్, బస్సుల ఎమెర్జెన్సీ డోర్లు, కండీషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ షిప్ మంత్ర ఆన్‌లైన్ పార్సిల్ బుకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులను కోరారు.

వైభవుని కల్యాణ శుభలేఖల పంపిణీ


కార్యక్రమంలో పాల్గొన్న కల్యాణదాతలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల నిర్వహణలో భాగంగా కల్యాణ శుభలేఖల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ మేరకు వైభవుడు, భూదేవీ, శ్రీదేవిల తరుపున కల్యాణదాతలు శుభలేఖలు ఇచ్చిపుచ్చుకునే కార్యక్రమం సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. వివరాలను ఆలయం అర్చకుడు శేషాచార్యులు తెలిపారు.

మే 9 నుంచి కొత్తమ్మవారి జాతర మహోత్సవాలు

- మే 30వ తేదీన ప్రధాన పండగ


అమ్మవారివీధిలో వెలసిన కొత్తమ్మవారు

అల్లిపురం: అమ్మవారివీధి కొత్తమ్మ వారి జాతర మహోత్సవాలు మే 9వ తేదీ నుంచి నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 9వ తేదీన భూలోకమ్మ పండగ, 14వ తేదీన పరదేశమ్మ వారి రాట పండగ, 16వ తేదీన పరదేశమ్మ పండగ, 21వ తేదీన కొత్తమ్మవారి ఉజ్జిడి బండి గ్రామంలో తిరుగుట, 22వ తేదీన పుట్ట బంగారం తెచ్చుట, 23వ తేదీన అమ్మవారి ఘటాలు గ్రామంలో తిరుగుట, 27వ తేదీన సత్తెమ్మ వారి పండగ, 28వ తేదీన మరిడమ్మ అమ్మవారి పండగ నిర్వహించనున్నట్లు తెలిపారు. 29వ తేదీన కొత్తమ్మవారి తొల్లేళ్ల ఉత్సవం, 30వ తేదీన కొత్తమ్మవారి ప్రధాన పండగ వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 6వ తేదీన కొత్తమ్మవారి మారువారం, 11వ తేదీన నారాయణ సేవ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించాలని కోరారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి


31వ వార్డులో పారిశుధ్య కార్మికుల హాజరు పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

జగదాంబ: పారిశుధ్య కార్మికులు అంకితభావంతో పని చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిశోర్ అన్నారు. గురువారం జోన్ పరిధి 31వ వార్డు శానిటరీ కార్యాలయంలో సిబ్బంది హాజరు పరిశీలించారు. కార్మికులందరూ సమయానికి విధులకు హాజరవ్వాలన్నారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విధిగా జీవీఎంసీ ఇచ్చిన యూనిఫామ్ ధరించాలన్నారు. సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పిండ ప్రదానం


కాశీలో పిండ ప్రదానం చేస్తున్న సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: వివేకానంద సంస్థ ఉన్నతికి తోడ్పాటునందించిన మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్, ముఖ్య వ్యవస్థాపకుడితో పాటు సంస్థ గౌరవ సభ్యులు డీఎస్ అగర్వాల్, ఎంఎస్ హక్, సీనియర్ పాత్రికేయుడు ఎం. అచ్చిరాజు, సంఘ సేవకుడు సూరాడ సత్తయ్య, మల్ల శివ, కె. రామారావుకు సంస్థ సభ్యులు పిండ ప్రదానం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

సమస్యల పరిష్కారం కోరుతూ కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీకి ఆదాయం చేకూర్చే ఇందిరా మున్సిపల్ స్టేడియం చుట్టు దుకాణ సముదాయాల నిర్మాణం, లక్ష్మీనగర్ మురికివాడ అభివృద్ధి, ప్రసాద్‌గార్డెన్స్ వద్ద ఖాళీగా ఉన్న జీవీఎంసీ స్థలంలో సామాజిక భవన నిర్మాణం, ఎస్‌ఎల్ కెనాల్‌లో పూడిక తీత, ర్యాంప్ నిర్మాణం, ఆయిల్ మిల్లురోడ్డులో సీసీరోడ్డు నిర్మాణం, పూర్ణామార్కెట్ చేపల మార్కెట్ పాత దుకాణ భవనాన్ని తొలగించి కొత్త దుకాణ సముదాయ నిర్మాణం, గాజులవీధిలో స్క్రాప్ దుకాణాల తొలగింపు తదితర అంశాలపై వినతిపత్రం అందజేశారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవ వర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

మే డే సంబరాలను జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

సీతమ్మధార : మేడే సంబరాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. కంపెనీల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలని 137 ఏళ్ల క్రితం కార్మికులు పోరాడారన్నారు. అనేక హక్కులు సాధించుకున్న రోజు మేడే కనుక కార్మికులకు పండగా దినమని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 30న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే సాంస్కృతిక సంబరాలను, జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి.కృష్ణారావు, చంద్రమౌళి, వి.నరేంద్రకుమార్, పి. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బల్లిగిరి వెంకన్న కల్యాణరాట మహోత్సవం


కల్యాణరాట మహోత్సవంలో పాల్గొన్న ఆలయ ఈవో జీవీ రమాబాయి తదితరులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం సందర్భంగా గురువారం దేవాలయ ఆవరణలో కల్యాణరాట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. ముందుగా ఆలయ ఈవో జీవీ రమాబాయి పలువురు ముత్తయిదువులతో కలిసి మేళతాళాలు, వేద మంత్రాల మధ్య ముహూర్తపు రాటకు పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మే 1వ తేదీన వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున సాయంత్రం 7 గంటల నుండి ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణంలో పాల్గొనదలచిన వారు ముందుగా దేవస్థానంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 30వ తేదీన ధ్వజారోహణంతో కళ్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 5వ తేదీన పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం, తిరుమంజనసేవ, ధ్వజావరోహణం, సహస్ర దీపాలంకరణ సేవ, 6వ తేదీన శ్రీ పుష్పయాగార్చన, అష్టదళ పద్మారాధన, పాలికా ఉద్వాసన, ఊంజలసేవ, పవళింపు సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శ్రీనివాసరావు, రవి, భక్తులు పాల్గొన్నారు.

4న నృసింహ జయంతి..

మే 4వ తేదీన నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారు భక్తులకు నృసింహావతారంలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

'తప్పుడు కేసులు బనాయించి హింసిస్తున్నారు'

దాబాగార్డెన్స్: ప్రశ్నించినందుకు తమపై తప్పుడు కేసులు బనాయించడమే కాకుండా హింసిస్తూ తీవ్ర పదజాలంతో హెచ్చరిస్తున్నారని జీవీఎంసీ పరిధి భీమునిపట్నం 4వ వార్డు మంగమారిపేటకు చెందిన వాసుపల్లి మారాజు, వాసుపల్లి గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. వారికి జరిగిన అన్యాయాన్ని గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వివరించారు. తాము నిరుపేద మత్స్యకార కుటుంబాలకు చెందిన వారిమని, ఏ జీవనాధారం లేకపోవడంతో సమీప గ్రామంలో గల భూములకు ఇద్దరం వాచ్‌మేన్లుగా పనికి చేరామని చెప్పారు. తాము పని చేస్తున్న యజమాని ఆ భూమిని కొనుగోలు చేశారని చెప్పారు. ఆ భూమికి కాపాలాదారులుగా ఉన్నందున స్థానిక పెద్దలు దూడ అచ్యుతరావు, మేరుగు పుల్లయ్య, సూరాడ పరదేశి, ఉమ్మిడి నర్సింగరావు, గరికిన రాజు విశాఖకు చెందిన పేరబత్తుల నాగ వరప్రసాద్, నన్నపనేని రాజా రియల్ ఎస్టేట్ యజమానుల ప్రోత్సాహంతో భౌతిక దాడులు చేస్తూ, గుర్తు తెలియని వ్యక్తులతో రెక్కీ నిర్వహించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తమ కుటుంబాలను కుల బహిష్కరణ చేసి గ్రామంలో ఎవరైనా తమతో మాట్లాడితే రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్మానం చేశారని చెప్పారు. కిరాణా సరకుల యజమానిని హెచ్చరించి తమకు సరకులు ఇవ్వొద్దని హెచ్చరించారని తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

29న మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ


విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

దాబాగార్డెన్స్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఈ నెల 29న టీటీడీ చైర్మన్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు జీవీఎంసీ 30వ వార్డు తాడివీధిలో ఏర్పాటు చేయనున్న విగ్రహాన్ని, ఏర్పాట్లను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్థానిక వార్డు కార్పొరేటర్ కోదూరు అప్పలరత్నంతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, పార్టీ నాయకులు సత్యనారాయణ, చిన్ని, వడ్డాది దిలీప్, వేణు, రాము, ఆకుల శ్యామ్‌కుమార్, మంజు తదితరులు పాల్గొన్నారు.

మదిని దోచిన మధురగీతాలు


సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు

దాబాగార్డెన్స్: సాయిశ్రీ స్వర సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ఈ వేళలో నీవు ఏం చేస్తు ఉన్నావో' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి సంగీత ప్రియుల్ని ఆకట్టుకుంది. జయ జయ శుభకర, కళ్లల్లో కళ్లు పెట్టి చూడు.. మధురమే సుధాగానం.. పచ్చ బొట్టేసినా.. జాబిల్లి రావే.. పరువం వానగా.. సుప్రీం హీరో.. భలే భలే మగాడివో వంటి ప్రజాదరణ పొందిన గీతాలను గాయకులు ఆశామధు, రైల్వే రమణ, గుణశ్రీ, ఎమ్మెస్ మాధవ్, ఎస్ఎస్ఎన్ రాజు, లోకేష్, మల్లికా చౌదరీ, మహ్మద్‌ఖాన్, లయ, గీత, ఆంజనేయరెడ్డి, రాజారావు, రామ్‌కుమార్, జాస్మిన్, గౌరీ, అప్పారావు, వెంకటేష్, నాయుడు, రాము, దేవదాసు ఆలపించారు. ముందుగా విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, సంస్థ అధ్యక్షురాలు ఎం. ఆశామధు, కోశాధికారి సత్యనారాయణ, జీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.